క్లుప్తంగా

2న రైతుబజారులో ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరులోని ఆర్టీసీ బస్టాండ్ రైతు బజారులో ఆదివారం ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు కన్స్యూమర్ కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టరు జాతీయ ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు తెలిపారు. రైతు బజారు ఆవరణలో ఈ-శ్రమ్ కార్డ్ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రైతు బజారులో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ కార్డును పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్డు వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత పథకం కింద అమలు చేసే ప్రతి పయోజనం ఈ-శ్రమ్ కార్డుదారుడు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చేకూరి రాజశేఖర్, షేక్ మాబు సుభానీ, షేక్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పట్నంబజార్: బక్రీదు పండుగను పురస్కరించుకుని డెప్యూటీ మేయర్ షేక్ సజీల గురువారం మాయాబజార్‌లోని తన కార్యాలయంలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, ఖలీల్, చాంద్ పాల్గొన్నారు.

నాటా సభలకు విజయలక్ష్మి

నగరంపాలెం: అమెరికాలోని డల్లాస్ నగరంలో ఈనెల 30 నుంచి జులై మూడు వరకు నిర్వహించనున్న ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) సభల్లో పాల్గొనాలని నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందినట్లు ఏపీ స్టేట్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఆహ్వానం పంపిన నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతాలు



నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీ సాయినాథ సన్నిధానంలో గురుపూర్ణమి మహోత్సవాలు గురువారం మూడో రోజుకి చేరాయి. శ్రీసాయి సత్య వ్రతాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సాయినాథుడికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్ కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, అవుల అప్పారావు, సుధీష్ పాల్గొన్నారు.

మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పోలీసు బందోబస్త్



నగరంపాలెం: బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం జిల్లా పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్టమైన భద్రత చర్యల్ని చేపట్టారు. ప్రార్థనలకు అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ విధులు నిర్వహించారు.

4,564 కేసులు నమోదు

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని గుర్తించేందుకు గురువారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. బహిరంగంగా మద్యం తాగే 4,836 మందిపై 4,564 కేసులు నమోదు చేశారు. మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మత్తులో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని, కుటుంబం ఆర్థికంగా నష్టపోతుందని హితబోధ చేశారు.

పోలీసులు నిజాయతీగా ఉండాలి

జిల్లాలోని పోలీస్ యంత్రాంగం విధి నిర్వహణలో నిజాయతీగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి ఆరోపణలకు అవకాశం లేకుండా జవాబుదారీతనంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. అందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: మండలంలోని నందివెలుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1550 స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బైక్‌లు, ఆటో సీజ్ చేశారు. నిందితుల్ని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇంటింటికీ 'సురక్ష'

- రేపట్నుంచి జులై 28 వరకూ సచివాలయాల వారీగా క్యాంపులు
- గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తి, టోకెన్లు జారీ
- ప్రతి ఇంటికీ సంక్షేమమే 'జగనన్న సురక్ష' లక్ష్యం
- తొలి రోజు పాతమల్లాయపాలెంలో..



పాతమల్లాయపాలెంలో సర్వే చేస్తున్న వలంటీర్, సచివాలయ ఉద్యోగి(ఫైల్)

ప్రత్తిపాడు: అర్హులైన ఏ ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందకుండా ఉండకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' పేరుతో మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 23న అధికారికంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆరంభించినప్పటికీ, జులై 1వ తేదీ నుంచి అసలు కార్యక్రమం ప్రారంభం కానుంది. నాలుగు వారాల పాటు జరగనున్న కార్యక్రమంలో అనేక రకాల ప్రజా సమస్యలను పరిష్కరించనున్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా వివక్షకు తావు లేకుండా నూటికి నూరుశాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందించడమే సంకల్పంగా ఈ నెల 24 తేదీ నుంచి ఇంటింటి సర్వే మొదలయ్యింది.

సచివాలయాల వారీగా టోకెన్లు జారీ..

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వారం రోజుల పాటు గ్రామాల్లో సింటింటికీ తిరిగి సర్వే చేశారు. అర్హత ఉండీ పథకాలు అందని, లబ్ధిపొందని వారిని గుర్తించారు. వారి నుంచి పథకం పొందేందుకు కావలసిన పత్రాలను సేకరించారు. వాటిని సచివాలయంలో అందించి, టోకెన్ నంబర్లు జారీ చేశారు. జులై 1న మొట్టమొదటిగా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం సచివాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరగనుంది. ఇప్పటివరకు ఆ గ్రామంలో 383 టోకెన్లను ఇచ్చారు. సర్వీసు రిక్వెస్ట్ నంబరు ఆధారంగా క్యాంప్ జరిగే రోజు సంబంధిత సచివాలయానికి అర్జీదారు వచ్చేలా చర్యలు తీసుకుని వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. అదేవిధంగా మిగిలిన గ్రామాల్లోనూ సమస్యలున్న వారిని గుర్తించి టోకెన్లు జారీ చేస్తున్నారు.

రోజంతా సచివాలయంలోనే..

జగనన్న సురక్ష క్యాంప్ పకడ్బంధీగా జరగనుంది. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఈవోపీఆర్డీ, వ్యవసాయాధికారి, పీఆర్ ఏఈ, ఎంఈవో, హౌసింగ్ ఏఈలు ఒక బృందంగా, ఎంపీడీవో నేతృత్వంలో డెప్యూటీ తహసీల్దార్, ఎంఈవో-2, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోలు రెండవ బృందంగా నిర్ణీత తేదీల్లో ఆయా గ్రామాల సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యంత్రాంగ మంతా సచివాలయంలోనే ఉండి సర్వీసులను అందించి, సమస్యలను పరిష్కరించనున్నారు.

సర్వీసు ఫీజు లేకుండా సర్టిఫికెట్లు

ఇదిలా ఉంటే సచివాలయాల్లో ఎలాంటి సర్వీసు ఫీజులు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లును ఉచితంగా జారీ చేయనున్నారు.

- జనన ధృవీకరణ పత్రం
- మరణ ధృవీకరణ పత్రం
- కుల ధృవీకరణ పత్రం
- ఆదాయ ధృవీకరణ పత్రం
- ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్
- వివాహ ధృవీకరణ పత్రం
- లావాదేవీ మ్యుటేషన్లు
- ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం
- సీసీఆర్‌సీ కార్డులు
- కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన
- ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు..

మండలం	సచివాలయాలు
ప్రత్తిపాడు	13
పెదనందిపాడు	13
కాకుమాను	13
వట్టిచెరుకూరు	13
గుంటూరు రూరల్	13
మొత్తం	65

పక్కాగా జగనన్న సురక్ష కార్యక్రమం



జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే పూర్తి చేశారు. పాతమల్లాయపాలెంలో టోకెన్లు కూడా జారీ చేశాం. తొలిరోజు ఆ గ్రామంలోని సచివాలయంలోనే క్యాంప్ నిర్వహించనున్నాం. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ నూటికి నూరుశాతం లబ్ధి చేకూర్చి, పథకాలు అందించడమే కార్యక్రమం ఉద్దేశం.

– ఎ.శ్రీరమ్య, ఎంపీడీవో, ప్రత్తిపాడు

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు

పెదనందిపాడు: తొలి ఏకాదశి పూజలు గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈ సంవత్సరం పంటలు బాగా పండాలని, నష్టాలు రాకుండా చూడాలని స్వామి వార్లకు మొక్కుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

చేబ్రోలు: చేబ్రోలు, వడ్లమూడి, శలపాడు, నారాకోడూరు గ్రామాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు గురువారం చేశారు. విష్ణుమూర్తి పాలకడలిపై యోగ నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. దీనిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తారు. పూర్వకాలంలో ఇదే రోజును సంవత్సర ఆరంభంగా పరిగణించేవారని పండితులు చెబుతారు. శలపాడు గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో, వడ్లమూడి గరువుపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా అర్చకులు గంజాం శ్రీనివాస వరప్రసాద్ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు, విశేష కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వడ్లమూడి గరువుపాలెంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఎరుకుల జాతి ఆరాధ్య దైవం ఏకలవ్య

బాపట్ల: ఎరుకుల జాతి ఆరాధ్య దైవం ఏకలవ్యను ఆయన జన్మదినోత్సవం రోజు స్మరించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్ పాలపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏకలవ్య జన్మదినోత్సవం సందర్భంగా స్టువర్టుపురం గ్రామంలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రమశిక్షణ, పట్టుదలకు ఏకలవ్య మారుపేరుగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు బోగిరి శ్రీకాంత్ మిత్ర, ట్రెజరర్ జాలగిరి లీలా శంకర్, మేడ గోపీ, కుంభ చంద్ర, పాకాల రాజేష్‌బాబి, కిరణ్ తదితరులున్నారు.



ములాయం సింగ్ విగ్రహావిష్కరణ సభకు తరలిరండి

నడింపాలెం (ప్రత్తిపాడు): ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాద్ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ సభకు అధిక సంఖ్యలో అభిమానులు తరలి రావాలని సోషలిస్ట్ థింకర్స్ ఫోరం టీం సభ్యులు తాటి సత్యనారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. నడింపాలెంలో గురువారం రాత్రి ఇందుకు సంబంధించిన 'మన సభ మన కోసం' వాల్ పోస్టర్లను స్థానికులతో కలిసి ఫోరం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 9న పెదకాకాని టోల్ ప్లాజా సమీపంలో. ఏఎన్‌యూ ఎదురునున్న మైదానంలో జరగనున్న విగ్రహావిష్కరణ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోతురాజు లక్ష్మీనారాయణ, మద్దుల లక్ష్మీనారాయణ, సీహెచ్ లింగారావు, సూర్యబాలాజి తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బృంద సభ్యులు

ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత సిద్ధంకావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నగరంపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనుక ఉన్న మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని తిరోగమనంలో నడిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏపీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాజగారితోట శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా గురువారం 'భారత దేశ రాజకీయాలు-యువత పాత్ర' అనే అంశంపై ఆయన మాట్లాడారు. సభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అనైతిక పాలనకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత మిలిటెంట్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. కామన్ సివిల్ కోడ్ రావాలని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే కామన్ సివిల్ కోడ్ తీసుకొస్తుందని ఆరోపించారు. ఐపీసీ అందరికీ సమానంగా ఉంటుందని, సివిల్ అంశాలు ఎవరి మతానికి సంబంధించి వారికి వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. కామన్ సివిల్ కోడ్‌తో మతాలు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ కోసం గుంటూరు నుంచి అమృతరావు ఉద్యమం చేపట్టారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం నగరంలో ప్రదర్శన చేపట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పేదలకు బియ్యం పంపిణీ



గుంటూరు రూరల్: న్యూ జియోన్ మిషన్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్‌కే కృపాకర్ గురువారం వెంగళాయపాలెం గ్రామంలో పేదలకు సొసైటీ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. పది మంది పేదలకు పది కిలోల చొప్పున బియ్యం అందించారు. సొసైటీ సెక్రటరీ కె.కిషోర్, జాయింట్ సెక్రటరీ ఉద్దగిరి సాయిదుర్గా పాల్గొన్నారు.

యువతికి వేధింపులు.. యువకుడిపై కేసు నమోదు

పెదనందిపాడు: యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి, వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పెదనందిపాడు ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్ర గురువారం తెలిపారు. పెదనందిపాడుకు చెందిన యువతిని అదే గ్రామానికి ప్రవీణ్ అనే యువకుడు ఆమెకు దగ్గరగా ఉంటూనే ఇబ్బందులకు గురిచేశాడు. ఇది గమనించిన యువతి యువకుడిని దూరం పెడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను చూపించి, యువతిని బ్లాక్ మెయిల్ చేయడంతో.. భయపడిన యువతి దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. దీంతో యువతికి ధైర్యం చెప్పిన దిశ టీం సభ్యులు, స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. యువతి ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు. మహిళలను వేధింపులకు గురిచేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

రెండు బైకులు ఢీ.. ఇరువురికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ వివరాల మేరకు.. పెదపలకలూరు గ్రామానికి చెందిన షేక్ సుబాని ద్విచక్రవాహనంపై తురకపాలెం వెళుతున్నాడు. శ్యామల నగర్‌కు చెందిన చింతల శ్యామ్ ద్విచక్ర వాహనంలో పలకలూరుకు వెళుతున్నాడు. తురకపాలెం వద్ద ఇరువురి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో ఇరువురిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

అలరించిన బ్రహ్మంగారి నాటకం

నగరంపాలెం: భారతీ సాంస్కృతిక సంగీత కళా వేదిక ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటికను ప్రదర్శించారు. పలువురు పాత్రధారుల నటన ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఎం.వి.రమణమూర్తి, విశ్వకర్మ సంఘ సభ్యులు తుర్లపాటి శంభయాచారి, ఈశ్వరచారి, కాజ భరద్వాజ, మేదూరి ప్రసాదరావు పాల్గొన్నారు. చివరగా కళాకారుల్ని కళా సేవారత్న అవార్డులతో సత్కరించారు.



కళాకారులకు సత్కారం

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యం



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి

- తక్కెళ్లపాడులో రెండవరోజు గడప గడపకు మన ప్రభుత్వం
- ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించిన ఎమ్మెల్యే కిలారి

తక్కెళ్ళపాడు(పెదకాకాని): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. తక్కెళ్లపాడు గ్రామంలో రెండవ రోజు ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకొచ్చినట్లు తెలిపారు. తక్కెళ్లపాడు పాత బాల ఏసు నగర్, ఈబీసీ కాలనీ ప్రాంతాల్లో కాలువలు, రోడ్లు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామంలో మొత్తం 325 కుటుంబాలను కలసి సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించి, బ్రోచర్ అందజేశారు. సమస్యల పరిష్కారానికి స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, స్థానిక నాయకులు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, మేరిగ సుబ్బారావు, పెనుమాల అరుణ్‌కుమార్, పెరవలి కిషోర్, బండి మరియమ్మ, నాగరాజు, మల్లేశ్వరరావు, వాజీరావు, బ్రహ్మయ్య, బాబు, కిలారి రమేష్, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్



కొమ్మూరు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పొన్నూరులో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు



పెదకాకానిలో బక్రీద్ ప్రార్థనలు



అన్నదానం చేస్తున్న హిందూ ముస్లిం స్నేహితులు

పెదకాకాని: ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మత పెద్దలు మాట్లాడుతూ జంతువును ఖుర్బానీ (దానం) ఇచ్చే పండుగ కనుక దీనిని ఈదుల్ ఖుర్బాని అని కూడా అంటారన్నారు. మహ్మదీయులు సంవత్సరాన్ని హిజ్రీ అనే పేరుతో పిలుసుకుంటారు. హిజ్రీ అంటే వలస పోవడమని, మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు తరలివెళ్లడాన్ని హిజ్రీగా పేర్కొంటారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని గురువారం ఉదయం నుండే ముస్లింకాలనీల్లో పండుగ సందడి నెలకొంది. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఆనందంగా పండుగ జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా స్నేహితులు, ఆప్తులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు.

సంతోషంగా బక్రీదు వేడుకలు

చేబ్రోలు: బక్రీద్‌ను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. వడ్లమూడి, వేజండ్ల, సుద్దపల్లి, చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు గ్రామాల్లో బక్రీద్ పండుగ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖుర్బానీ గొప్పతనం తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకొని దువా చేశారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లోని ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

పెదనందిపాడు: మండలంలో గురువారం ఘనంగా బక్రీద్ వేడుకలు జరిగాయి. స్థానిక జమ్మా మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు ప్రతి ఒక్కరూ సహనం, ధైర్యం, కలిగి ఉండాలని సూచించారు. పేద వారికి చేతనైనంతా సాయం చేయాలని, హజ్రత్ ఇబ్రాహీం, ఇస్మాయిల్ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని ఉపదేశించారు. ప్రార్థన అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని కాకుమాను, కొమ్మూరు, రేటూరు, కొండపాటూరు, గరికపాడు, పాండ్రపాడు, లింగంగుంటపాలెం గ్రామాల్లో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పేదలకు అన్నదానం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో గురువారం బక్రీద్, తొలి ఏకాదశి సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలకు పండుగనాడు కడుపు నిండా భోజనం అందించాలన్న సదుద్దేశ్యంతో ఆరుగురు స్నేహితులు రామిశెట్టి ఆదేశ్వరరావు, షేక్ మీరాసాహెబ్, ఎస్.వీరాంజనేయులు, అంకమ్మరావు, నాని, వీరారావులు అన్నదానాన్ని చేపట్టారు. రోడ్ల వెంట, బస్టాండు ఆవరణల్లో, ఫుట్‌పాత్‌లు, రోడ్లవెంబడి ఉండే సుమారు రెండు వందల మంది వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు అన్నదానం చేశారు.

మనవళ్లపై నాయనమ్మ ఫిర్యాదు

భట్టిప్రోలు: మనవళ్లు తనపై దౌర్జన్యం చేసి, ఏసీని పగల గొట్టడంతో ఓ వృద్ధురాలు స్థానిక పోలీసులను ఆశ్రయించింది. వివరాల మేరకు..భట్టిప్రోలు మండలం కోనేటిపురానికి చెందిన వృద్ధురాలు మండే పుష్పలత కుమారుడు మృతి చెందాడు. ఇద్దరు మనవళ్లు విజయవాడలో ఉంటున్నారు. ఈ క్రమంలో మనవళ్లు శైలేష్‌పాల్, దినేష్ మరో వ్యక్తి వచ్చి తమ ఏసీ(ఎయిర్ కూలర్) ఇంట్లో ఉందని, తమకివ్వాలని అడిగారు. ఆమె ఇవ్వనన డంతో ఈ ఏసీని వారు పగలగొట్టారు. దీంతో నాయనమ్మ పుష్పలత గురువారం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి యువకుడి మృతి



రేపల్లెరూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని 5వ వార్డులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భట్టిప్రోలు మండలం కోళ్లపాలేనికి చెందిన కొమరాబత్తుని నితిన్(20) విద్యుత్ తీగలను సరి చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. వైర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు తీగలు తగిలి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో.. తోటి కార్మికులు అతనిని వైద్యశాలకు తరలించే లోపే మృతి చెందాడు. ఈ విషయమై విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు మాట్లాడుతూ ప్రైవేట్ కాంట్రాక్టర్ వద్ద మృతుడు పనిచేస్తున్నాడని తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.